క్లుప్తంగా

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల వివిధ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, డిప్లొమా అండ్ పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, సర్టిఫికెట్ ఇన్ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



కాచిగూడ: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని నింబోలిఅడ్డ, మౌలానా ఆజాద్‌నగర్, లాల్ బంగ్లా, మోతీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పర్యటించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు ఇళ్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, కళ్యాణ్‌బాబు, రాజా, రవి యాదవ్, భీమ్‌రాజ్, సంతోష్, నాగు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చాను మరింత బలోపేతం చేయాలి

కాచిగూడ: తెలంగాణలో మహిళా మోర్చాను మరింత బలోపేతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ అన్నారు. బుధవారం కాచిగూడలోని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఇంటికి ఆమె వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రాజకీయాలతో పాటు తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి కూడా చర్చించినట్టు సమాచారం.

వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు

చిక్కడపల్లి: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ జలమండలి డివిజన్-5 జీఎం రామకృష్ణను కోరారు. బుధవారం సాయంత్రం జీఎంను కలిసిన ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో తాగునీటిలో ప్రెష్, కలుషిత నీటి సరఫరా, సీవరేజ్, వేసవిలో తాగునీటి సమస్యలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సీవరేజ్ లైన్ శుభ్రం చేసి 10 రోజులుగా వ్యర్థాలను రోడ్లపైనే వదిలేస్తున్నారన్నారు. దీనికి స్పందించిన ఆయన సిబ్బందితో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్‌బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, నగర బీజేపీ యువనేత వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేక విధానాలను ఉపేక్షించం

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి అన్నారు. కేంద్రం అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలను ఇక ఉపేక్షించేది లేదని, 2024 ఎన్నికలే లక్ష్యంగా బీసీలు తిరుగుబాటు చేసి బీజేపీని ఓడిస్తారన్నారు. బుధవారం బీసీ దళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీల అభివృద్ధి కోసం పథకాలు అమలు చేసేందుకు జనాభా వివరాలు అవసరమన్నారు. రాష్ట్రంలోని బీసీల వివరాలు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు లేఖ రాశారని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా కలిసి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు.

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గృహ అవసరాల గ్యాస్‌పై రూ.50 పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపిందన్నారు. పెంచిన ధరతో సిలిండర్ రూ.1150కి చేరిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలపై మోయలేని భారం మోపుతుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో రూ.450 ఉన్న ధరను మూడింతలు పెంచి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. వెంటనే పెంచిన మొత్తాన్ని తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: నార్సింగిలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి సాత్విక్ తరగతి గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ జరిపి సంబంధిత కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. యాజమాన్యం, ఉద్యోగులు, ప్రిన్సిపాల్, వార్డెన్‌లు మానసికంగా వేధించడంతోనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

- వరుస ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్న కార్పొరేటర్ విద్యా సంస్థల ఆగడాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురామ్ డిమాండ్ చేశారు.
- ర్యాంకుల వేటలో ప్రాణాలు వదులుతున్న విద్యార్థులను ప్రభుత్వం కాపాడి వారికి మనోస్థైర్యం నింపేలా తగిన కార్యచరణ రూపొందించాలన్నారు. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆజాద్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, శ్రీకాంత్‌లు ఉన్నారు.



బీసీ భవన్‌లో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి..

- విద్యార్థి మృతిపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో కార్పొరేట్ విద్యా సంస్థలను తరలిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 8 ఏళ్లు గడుస్తున్నా కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టలేకపోతున్నారని విమర్శించారు. ప్రతి ఏటా కార్పొరేట్ విద్యాసంస్థల ర్యాంకుల వేటకు అనేక మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారని విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘం నాయకులు లాల్ కృష్ణ, మల్లేష్‌యాదవ్, అంజి, లక్ష్మీనారాయణ, నందగోపాల్, వెంకటకృష్ణ, సైదులు, వంగూరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదువుల పేరుతో విద్యార్థుల బలి..



ప్రవీణ్‌కుమార్

అంబర్‌పేట: చదువుల పేరుతో విద్యార్థులను బలి తీసుకుంటున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేవైఎం సెంట్రల్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. నార్సింగి శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థతతోనే కార్పొరేట్ కళాశాలలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్నారు. మృతిచెందిన విద్యార్థి సాత్విక్‌కు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కందూరి కృష్ణ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని స్ట్రీట్ నెంబర్ 10లో గతేడాదిగా కలుషిత తాగునీటి సరఫరా అవుతోందని దీంతో స్థానిక ప్రజ లు అనారోగ్యాలకు గురవుతున్నారని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. బుధవారం జలమండలి ఆపరేషన్-1 డైరెక్టర్ కృష్ణ ఆజ్మీరాకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ సంబంధిత జనరల్ మేనేజర్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. చిక్కడపల్లి స్ట్రీట్ నెంబర్-10 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు ఉన్నారు.

సాయన్నకు నివాళి



ముషీరాబాద్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భక్తి పారవశ్యంతో మార్మోగిన న్యూ రామాలయం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారాంమాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణం త్యాగరాజ స్వామి కీర్తనలతో మార్మోగింది. శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధన సంగీతోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం కార్యక్రమాన్ని గానసభ కార్యదర్శి కొణికి సాయిశ్రీనివాసశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు సీహెచ్ కృష్ణవేణి, కృష్ణమోహన్, పీవీ సుబ్బారావులు త్యాగరాజ స్వామి కీర్తనలను గానం చేసి ఆహుతులను అలరించారు. మృదంగంపై కర్రా శ్రీనివాస్, తబలాపై గుణశేఖర్, వయోలిన్‌పై ఎస్‌పీ అనంత కృష్ణ వాయిద్య సహకారం అందించారు. అనంతరం నిర్వాహకులు సంగీత కళాకారులను సన్మానించారు.



త్యాగరాజస్వామి కీర్తనలు గానం చేస్తున్న కృష్ణవేణి

రేవంత్‌రెడ్డి యాత్రలో దాడిని ఖండించిన నేతలు

చిక్కడపల్లి: భూపాలపల్లిలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్రపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని ముషీరాబాద్ కాంగ్రెస్ నేతలు మేడి సురేష్ , గుర్రం శంకర్, శీలం సత్యనారాయణ, అభిషేక్ కెన్నడీ, పుస్తకాల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాలకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నేతలు దాడికి పాల్పాడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి దాడులకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు.

'ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలి'



జోడో యాత్రలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం కవాడిగూడ మున్సిపల్ క్వార్టర్స్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజలకు వివరించారు.

- కాంగ్రెస్ హయాంలో రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ. 1155కు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ముషీరాబాద్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీడీ కృష్ణ, నగర కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, ఎం.ప్రభాకర్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ధర్మేందర్, మాజీ అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు రమేష్, భాస్కర్, కుమార్, రాము, బాబురావు, సత్యనారాయణ, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, గుర్రం శంకర్, సురేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌యూ చీఫ్ ఎంఎస్. మహేష్‌కు సన్మానం

అంబర్‌పేట: దూరదర్శన్ యాదగిరి ప్రాంతీయ వార్తా విభాగం కొత్త చీఫ్‌గా డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్.మహేష్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆర్‌ఎన్‌యూ చీఫ్‌గా విధులు నిర్వహించిన సురేఖ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో మహేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం న్యూస్ పిటిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను వార్తా విభాగం సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. న్యూస్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రశాంతి దేవి, అసిస్టెంట్ న్యూస్ ఎడిటర్స్ సుధాకర్, రమణ్‌రాజ్ రత్న, న్యూస్ విభాగం అధికారులు అనురాధ, కృష్ణ, న్యూస్ ప్రెసెంటర్లు త్రిమూర్తులు, పవన్, వీడియో ఎడిటర్ సురేష్, పీపీఏలు భూమిరెడ్డి, స్వామి, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల కొత్త ఆలోచనలకు సైన్స్ ఎగ్జిబిషన్ దోహదం



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్‌లోని కేఆర్‌కే పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. బుధవారం ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల కొత్త కొత్త ఆలోచనలకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయన్నారు. చిన్నారులు సుమారు 200 ప్రదర్శనలు ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే వారిని అభినందించారు. పాఠశాల చైర్మన్ రవికుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ సువర్ణ మాట్లాడుతూ.. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం గురించి తల్లులకు వివరించారు. పిల్లలకు వయస్సుకు తగిన ఎత్తు, బరువులు చూడటం జరిగిందని పిల్లల ఎదుగుదలకు సంబంధించిన పర్యవేక్షణ కార్డును ఐదేళ్ల లోపు పిల్లల తల్లులకు అందజేసినట్లు పేర్కొన్నారు. పోషక విలువలతో ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. పోషక ఆహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే శారీరక అభివృద్ధి లోపం,ఇన్ఫెక్షన్లు, ఆలోచన శక్తిలోపం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. అనంతరం గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు.



మూసీలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అంబర్‌పేట: మూసీలో గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. నదీ ప్రవాహంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు అంబర్‌పేట పోలీసులకు బుధవారం సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సాయంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు (40) ఏళ్లు ఉంటాయని, నలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

అంబర్‌పేట: అనారోగ్యం, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం .. గోల్నాక వీరన్నగుట్టలో నివసించే పద్మ మల్లేష్‌ల కుమారుడు అరుణ్‌కుమార్(30) గతనెల 26న బయటకు వెళ్లి రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చాడు. వెన్నునొప్పితో బాధపడుతూ మంచంపై నుంచి కిందపడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు సముదాయించే క్రమంలో గొడవపడ్డారు. దీనికి మనస్థాపం చెందిన అతడు యాసిడ్ తాగడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరుణ్‌కుమార్ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన



ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఏసీపీ శంకర్రాజు

హిమాయత్‌నగర్: ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్రాజు పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో 'రోడ్డు భద్రత-ట్రాఫిక్ నిబంధనలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. భావి పౌరులుగా ఎదగాల్సిన వారు అర్థాంతరంగా రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలించకూడదనే ఉద్దేశంతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తాము వివరించిన అంశాలను కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వారికి, బంధువులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ గురించి వీడియో ప్రదర్శన నిర్వహించారు.

వృద్ధుడి అదృశ్యం

చిక్కడపల్లి: ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చిక్కడపల్లి కల్లేపల్లి బ్రదర్స్‌లేన్‌లో నివసించే గండమల్ల రాములు (74) మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఆయన బంధువులు ఫిర్యాదు చేశారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ తదితరులు

అంబర్‌పేట: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలో రూ.4 లక్షలతో నిర్మించే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధార్థముదిరాజ్, జాఫర్, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ అంబర్‌పేట్ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం యువతకు అన్నివిధాలా చేయూతనిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అంబర్‌పేట్ వాటర్‌వర్క్స్ గ్రౌండ్‌లో బీఆర్‌ఎస్ అంబర్‌పేట్ యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 24 జట్లు పాల్గొని క్రికెట్ ఆడటం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ పులి జగన్, సీనియర్ నాయకులు ఎక్కాల కన్న పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

కాచిగూడ: మార్షల్ ఆర్ట్స్‌తో మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. నకరికల్‌లో జరిగిన 8వ తెలంగాణ స్టేట్ షోటోఖాన్ కరాటే టోర్నమెంట్‌లో బాగ్ అంబర్‌పేటకు చెందిన సత్యసాయి విద్యా విహార్ స్కూల్ విద్యార్థులు పాల్గొని 18 మెడల్స్‌ను సాధించారని కరాటే మాస్టర్ బోడ విశ్వనాథం ప్రకటించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వసుధ అభినందించి సత్కరించారు. పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ సుదర్శన్

'అవినీతికి చరమగీతం పాడాలంటే బీజేపీకి మద్దతివ్వాలి'



బీజేపీ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి

కవాడిగూడ: 'రాష్ట్రంలో పెరుగుతున్న అవినీతి, అక్రమాలకు చరమగీతం పాడాలంటే బీజేపీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని' కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం కవాడిగూడ డివిజన్ అడ్వకేట్ కాలనీలో ప్రజాగోస-బీజేపీ భరోసా పేరుతో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కార్పొరేటర్ రచనశ్రీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవాడిగూడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ముషీరాబాద్‌లో బీజేపీని గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, శ్రీనివాస్ ముదిరాజ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, కేశవరాజు, బూత్ ఇన్‌చార్జ్‌లు మోహన్‌సాయి, పృథ్వీ, నాయకులు సీ.హెచ్.శ్రీనివాస్‌ముదిరాజ్, శివరాజ్, కుమార్‌గౌడ్, దిలీప్‌యాదవ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని కూరగాయల మార్కెట్ వద్ద స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ప్రతి కార్యకర్త అందుబాటులో ఉండి స్థానిక సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు. బీజేపీ సీనియర్ నాయకులు సత్యనారాయణ మూర్తి, పార్థసారధి, నాయకులు జైపాల్‌రెడ్డి, వేణు, మంగళ, శివాజీ, శంకర్, బాలకృష్ణగౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి కేంద్ర పథకాలు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలి



నల్లకుంట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని మిషన్ మోదీ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మండలం. జిల్లా స్థాయిలో మిషన్ మోదీలో కార్యకర్తలను చేర్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా సంజయ్‌ఠాకూర్‌ను మిషన్ మోదీ రాష్ట్రీయ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బిజాక్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మిషన్ మోదీ రాష్ట్రీయ సంఘ్ రాష్ట్ర ప్రతినిధులు రజిత, సరిత, సీత, పద్మ, జూలీ శిల్పారెడ్డి, బిందు, హిమ, ఉదయ్‌గోపాల్, అనిల్‌రెడ్డి, ప్రవీణ్, ఏవీరావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దత్తమూర్తి



పుంజాల దత్తమూర్తి

నల్లకుంట: మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమకారుడు పాతబస్తీ ఖబూతర్‌ఖాన్‌కు చెందిన పుంజాల రామేశ్వర్ దత్తమూర్తి నియమితులయ్యారు. మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్ ఆయన నియామకాన్ని ప్రకటించారు. బుధవారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిన సమితి అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలను స్వాగతించిన ఐక్యపోరాట సమితి..

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహ చైర్మన్‌గా తోట రఘునాథ్‌రావుకు బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు, న్యాయవాది కొండూరు వినోద్‌కుమార్ అన్నారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఉన్నతమైన ఆశయంతో ఏర్పాటు చేసిన మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం వ్యవస్థాపక ట్రస్టుల ఆశయాలను ట్రస్టు బోర్డు సభ్యులు నెరవేర్చాలని ఆయన కోరారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులు పరస్పర అవగాహనతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మున్నూరుకాపు ట్రస్ట్‌బోర్డు డీడ్‌లో తక్షణమే మార్పులు చేసుకునేందుకు రిజిస్ట్రార్ చేయాలని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

కాలనీల్లో వీధికుక్కల బెడద

పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు

నల్లకుంట: డివిజన్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఎటు చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో కుక్క కనబడితే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు ఇటీవల యానిమల్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ)లో కుక్కల పునరుత్పత్తి నివారణకు సంబంధించిన వైద్యం నామమాత్రంగా నిర్వహించడంతో వాటి సంతతి రోజురోజుకూ పెరిగిపోతుందనే ఆరోపణలున్నాయి.

కుక్కలు సంచరించే ప్రాంతాలు..

- నల్లకుంటలోని స్ట్రీట్ నంబర్ -6, న్యూనల్లకుంట, న్యూరామాలయం వీధి, నర్సింహ బస్తీ, టీఆర్టీ కాలనీ, తిలక్‌నగర్ బస్తీ, గోల్నాక మార్కెట్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో కుక్కల దాడిలో ప్రజలు గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులకు ఒంటరిగా బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.